క్లుప్తంగా

కబడ్డీ జట్ల ఎంపిక

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బీసీగురుకుల విద్యాలయ మైదానంలో 8వ తేదీన సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూలోకరావు, కర్తయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల, బాలికలు 55కిలోల లోపు బరువు ఉండాలని, 16 సంవత్సరాలకు మించి ఉండరాదని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

కొండమల్లేపల్లి: ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని డీఈసీ సభ్యుడు ఇస్మాయిల్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం కొండమల్లేపల్లిలోని శ్రీ క్రాంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట స్క్వాడ్స్ నుస్రతాన్, జహీరుద్దీన్, శ్రీనివాస్, శిరీష, ప్రిన్సిపాల్ దుండిగళ్ల అశోక్, ఎర్రమద గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

డిండి: మండల కేంద్రానికి చెందిన నల్లగంతుల రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం డిండి యువత చేయూత ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయంగా రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో బాదమోని శ్రీనివాస్‌గౌడ్, ఏటి కృష్ణ, చింతపల్లి నరేష్, బూషిపాక అంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని బోయగూడెం గ్రామంలో బుధవారం పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామి వారి కల్యాణంలో పాల్గొని పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, మోహన్‌రావు, గురువయ్య, ఆంజనేయులు, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

దేవరకొండ: బీజేపీ దేవరకొండ మున్సిపల్ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పార్టీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కర్నాటి సురేష్, బెజవాడ శేఖర్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలకు మేలు జరిగే విధంగా రూ.12లక్షల ఆదాయం వరకు ఇన్‌కంటాక్స్ చెల్లింపునకు మినహాయింపు ఇవ్వడం సంతోషకరమన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయ కులు నక్క వెంకటేష్ యాదవ్, నేతాళ్ల వెంకటేష్, నారోజు పద్మ, జల్ల భాస్కర్, సముద్రాల సహదేవ్, చండీశ్వర్, రెడ్డి శంకర్ తదితరులున్నారు.

పడమటిపల్లితండా వాసికి డాక్టరేట్

దేవరకొండ: దేవరకొండ మండలం పడమటిపల్లి తండాకు చెందిన అన్నలూరి భావన ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఆమె ప్రస్తుతం చౌటుప్పల్ మండలం మల్కాపూల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. గిరిజన బాలికల్లో ప్రథమంగా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో పాలమూరు విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, సీనియర్ ప్రొఫెసర్ డా.ఎల్.బి లక్ష్మీకాంత్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేసినట్లు తెలిపారు.

ఎన్జీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాలకులో పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ఆదే మల్లేశంకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ సీహెచ్.దినేష్‌కుమార్ పర్యవేక్షణలో నేషనల్ బ్యాక్వర్డ్ క్లాసెస్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏ స్టడీ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇట్స్ రికమండేషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. మల్లేశంకు డాక్టరేట్ రావడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాస్, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ పరంగి రవికుమార్, సీఓఈ బి. నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ ప్రసన్నకుమార్, డాక్టర్ వెల్దండి శ్రీధర్, ఎన్‌సీసీ ఆఫీసర్ సీహెచ్.సుధాకర్ అభినందించారు.

కంకర తేలింది

డిండి: డిండి బస్టాండ్ ఆవరణలో కంకర తేలడంతో బస్సులు ప్రయాణిస్తున్న సమయంలో దుమ్ము లేస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు నిర్మించాలని పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

బస్టాండ్ ఆవరణలో తేలిన కంకర →



లోపించిన పర్యవేక్షణ

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని పచ్చర్లబావి సమీపంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ రూర్బన్ నిధులతో నిర్మించిన మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘ భవనంలో నిర్వహణ లోపం కనిపిస్తోంది. రూ. 33లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని 2024 ఎన్నికలకు ముందు అప్పటి దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రారంభించారు. ప్రారంభించిన నెల రోజుల తర్వాత ఈ భవనాన్ని మత్స్యకార్మిక సంఘానికి అప్పజెప్పారు. దీంతో ఈ భవనం నిర్వహణ బాధ్యత ఆ సంఘమే పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ నిర్వహణ లోపంతో ప్రారంభించిన ఏడాదిలోపే మరుగుదొడ్డి తలుపులు ఊడిపోయాయి. భవనంలో విద్యుత్‌దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి.



ఊడిపోయిన మరుగుదొడ్డి తలుపులు

కార్పొరేట్‌కు అనుకూలంగా కేంద్ర బడ్జెట్



హాలియాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

- సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహనం

హాలియా: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలం ఉందని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ లక్ష్మీనారాయణ, తుమ్మల వీరారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కున్‌రెడ్డి నాగిరెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం హాలియా పట్టణంలో సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య, వైద్య, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించుకోవాలని, కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రవినాయక్, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రామచంద్రయ్య, కేవీపీఎస్ జిల్లా నాయకులు దైద శ్రీను, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కారంపూడి ధనమ్మ, నాయకులు కోటేష్, గురువయ్య, సోమయ్య, పుల్లయ్య, నాగార్జున, మల్లయ్య, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



మాడ్గులపల్లిలో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

రాష్ట్రానికి నిధులు తీసుకురావాలి

వేములపల్లి(మాడ్గులపల్లి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని ఆరోపిస్తూ బుధవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో సీపీఎం నాయకులు కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, బొమ్మకంటి అంజయ్య, ఊరుగొండ శ్రీను, అయితగాని విష్ణు, జుకూరి నాగయ్య, మునగాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

దేవరకొండ: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య ఆరోపించారు. బుధవారం కిసాన్ మోర్చా, జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు దేవరకొండ పట్టణంలో నల్లజెండాతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తారమ్మ, ఏసు, రాజేష్, ఏసోబు, నక్రునాయక్ తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

దైవచింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే బాలునాయక్



పూజలకు హాజరైన ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి: దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని మేడారంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, దేవాలయ కమిటీ చైర్మన్ చెన్నారెడ్డి, వైస్ చైర్మన్ సత్యం, హనుమారెడ్డి, విఠల్, నారాయణ, నక్క సైదయ్య, అంతిరెడ్డి తదితరులున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలి

హాలియా: ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం హాలియాలోని సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను అధ్యక్షతన సీపీఎం నాగార్జున సాగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంపన్న వర్గాలకు దోచి పెట్టేదిగా ఉందని విమర్శించారు. విద్యా, వైద్యం, ఉపాధి ధరలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ లక్ష్మీనారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు నాగిరెడ్డి, వివిధ మండలాల కార్యదర్శులు అవుతా సైదయ్య, కందుకూరి కోటేష్, దైద శ్రీను, దుబ్బ రామచంద్రయ్య, రవినాయక్, నాయకులు గురువయ్య, సోమయ్య వేములకొండ పుల్లయ్య, నాగార్జున, కారంపూడి ధనలక్ష్మి, కోరే రమేష్, వెంకటయ్య, మల్లయ్య, పొదిల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



హాలియాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్

పెద్దవూర: రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్సీ, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. బుధవారం సాయంత్రం పెద్దవూర మండల కేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న 339 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల వేతనాల పెంపుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఆర్‌టీలు, ఎయిడెడ్ స్కూల్ టీచర్లకు 010 హెడ్ కింద ట్రెజరీల ద్వారా వేతనాలు అందించేలా, హెల్త్ కార్డులు జారీ చేసేలా చూస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఎండీ.షబ్బీర్, బి.కృష్ణ, డి.శ్రీను నాయక్, సంధ్య, షాహీన్‌బేగం, సైదులు, శాంతి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కంకర మిల్లు తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని గాజీనగర్ గ్రామంలో కంకర మిల్లును తొలగించాలని దేవరకొండ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌ఉమేర్ ఖాసీం కోరారు. ఈమేరకు బుధవారం అడిషనల్ కలెక్టర్, మైనింగ్ అధికారి ఏడీ జాకబ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కంకర మిల్లు కారణంగా దుమ్ము, ధూళి, పేలుడు సమయంలో విపరీతమైన శబ్దాలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొమ్మనేని విజయ్‌కుమార్, ఆదిత్యనగర్ కాలనీవాసులు ఉన్నారు.

డ్రోన్ సర్వేకు 50 పాయింట్లు గుర్తింపు

మిర్యాలగూడ టౌన్: మున్సిపాలిటీలో డ్రోన్ సర్వే చేపట్టేందుకు సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 50 జీపీఎస్ పాయింట్లు గుర్తించినట్లు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అర్బన్ ల్యాండ్ రికార్డ్స్ కోసం పైలట్ ప్రాజెక్టుగా డ్రోన్ సర్వే నిర్వహించేందుకు ప్రాథమిక సర్వేను చేపట్టనున్నట్లు తెలిపారు. సర్వేలో 14 బృందాలు ఉంటాయని, సర్వేయర్లు, రెవెన్యూ, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. పట్టణాన్ని మూడు భాగాలుగా మినిమం సర్క్యూట్, ప్రజెంట్ సర్క్యూట్‌గా, బ్లాక్ మ్యాప్‌గా తీయడం జరుగుతుందన్నారు. ప్రాథమిక సర్వే ఈ నెల చివరి వరకు పూర్తి చేసి మార్చి మొదటి వారం నాటికి గచ్చిబౌలిలో ప్రత్యేక శిక్షణ పొందిన డ్రోన్ సర్వేయర్లకు తుది సర్వే కోసం నివేదిక అందజేస్తామని తెలిపారు. సమావేశంలో మండల తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ డీఈ వెంకన్న, టీపీఓ సోమయ్య, టీపీఎస్ అంజయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డీఈఈ వెంకన్న, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్పీ అసోసియేట్ ప్రతినిధులు ప్రవీణ్, నవీన్‌కుమార్, భవాని ప్రసాద్, గంగాప్రసాద్, భార్గవ్ తదితరులున్నారు.



జీపీఎస్ పాయింట్ల గుర్తింపు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్, కమిషనర్

అనర్హులకు పదోన్నతులు ఇవ్వొద్దు



డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్ 327 యూనియన్ సంఘం నాయకులు

మిర్యాలగూడ: అనర్హులకు పదోన్నతులు ఇవ్వొద్దని మిర్యాలగూడ 327(ఐఎన్‌టీయూసీ) విద్యుత్ యూనియన్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ పరిధిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తిపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ ఫిర్యాదులు ఉన్నప్పటికీ స్థానిక ఉన్నతాధికారులు అతనికి ప్రమోషన్ ఇచ్చేందుకు లైన్ క్లియర్ చేస్తున్నారని ఆరోపించారు. స్పందించిన మిర్యాలగూడ విద్యుత్ డీఈ మాట్లాడుతూ.. సదరు లైన్‌మెన్‌పై వచ్చిన డీఈ ఎంక్వయిరీ రిపోర్ట్ ప్రకారంగా చర్యలు తీసుకుంటామని, విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఆంజనేయులు సత్తార్, గోపాల్‌రెడ్డి, అబ్దుల్‌పాషా, శ్రీరాములు, రమణారెడ్డి, రవినాయక్, కొండల్, కుమార్, సైదులు, శ్రీధర్‌రెడ్డి, రవీందర్, వెంకటేశ్వర్లు, ముత్యాలు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కుల గణన నివేదికను తిరస్కరిస్తున్నాం

నల్లగొండ టౌన్: ప్రభుత్వం ప్రకటించిన కులగణన నివేదికను తిరస్కరిస్తున్నామని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ అన్నారు. బుధవారం నల్లగొండలో బీసీ విద్యార్థి సంఘం, బీసీ సంక్షేమ సంఘం, బీసీ రాజ్యాధికార సమితి, విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సమగ్ర కులగణన సర్వే నివేదిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించక తప్పదన్నారు. బిహార్ తరహాలో రెండోసారి కుల గణన సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో పందుల సైదులు, పెండెం ధనుంజయ్, కర్నాటి యాదగిరి, విజయ్‌కుమార్, సతీష్, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

డిండి: రథసప్తమిని పురస్కరించుకొని బుధవారం డిండి మండలంలో శ్రీవేంకటేశ్వర స్వామి రథోత్సవ కార్యక్రమం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదేవిధంగా చెర్కుపల్లిలో పూలమాలలతో అలకరించిన స్వామి వారి రథాన్ని భక్తులు లాగి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు, యూత్ మండలాధ్యక్షుడు గడ్డమీది సాయికుమార్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, మల్లేష్, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు, ఏటి కృష్ణ, విజయ్, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



రథం లాగుతున్న భక్తులు



మిర్యాలగూడలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

మిర్యాలగూడ: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గుడిపూడి శ్రీనివాస్, ఆర్‌కె. ఉబ్బపల్లి కాశయ్య, రాజశేఖర్, శ్రవణ్, దైదా, సురేష్, కుక్కల సురేష్, రవి, శివ, నాని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలి



విద్యార్థులకు బిట్‌బ్యాంకు అందజేస్తున్న సభ్యులు

దేవరకొండ: విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని చంద్రన్న ఫౌండేషన్ అధ్యక్షుడు హన్మంతు వెంకటేష్‌గౌడ్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమారు వంద మంది విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన బిట్‌బ్యాంకులను ఆయన అందజేశారు. దేవరకొండ మండల పరిధిలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పరీక్షా ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిస్తే చంద్రన్న గోల్డ్ మెడల్‌తో పాటు రూ.50వేల నగదు ప్రోత్సాహకం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, హన్మంతు రాఘవేందర్‌గౌడ్, పాండు రంగారావు, పండరినాథ్, అంజయ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు



అగ్నిగుండ హారతినిస్తున్న భక్తులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండలంలోని బుడ్డోనితండాలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం అగ్నిగుండ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ముఢావత్ వెంకటేష్‌నాయక్, పాండునాయక్, చందునాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో లెప్రసీ నివారణ

రామగిరి(నల్లగొండ): ముందస్తు జాగ్రత్తలతో లెప్రసీని అరికట్టవచ్చని లైన్‌వాడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇక్తియార్ అన్నారు. లెప్రసీ వ్యాధిపై ఎన్జీ కళాశాలలో జువాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. లెప్రసీ అంటు వ్యాధి అని..ఒకరి నుంచి ఒకరికి సంక్రమిస్తుందని తెలిపారు. వ్యాధి లక్షణాల చార్ట్‌ను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ సి.జ్యోత్స్న, అధ్యాపకులు డాక్టర్ భాగ్యలక్ష్మి, సరిత, మహేశ్వరి, తుమ్మనగోటి వెంకట్, వైద్య సిబ్బంది బి.భాగ్యలత, ఎన్.నాగమణి, జుబేదా బేగమ్, జి.మమత తదితరులు పాల్గొన్నారు.



ఎన్జీ కళాశాలలో లెప్రసీ లక్షణాలు తెలియజేస్తున్న వైద్య సిబ్బంది

డ్రగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు

నల్లగొండ: గంజాయి సేవించినా, రవాణా చేసినా సెక్షన్ 20(బి)(ఐ)ఆఫ్ ఎన్‌డీపీఎస్ యాక్టు 1985 ప్రకారం 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తారని షీటీం భరోసా సీఐ కోట కరుణాకర్ అన్నారు. బుధవారం నల్లగొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహించిన డ్రగ్ అవేర్‌నెస్ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత చెడు దారి పట్టకుండా కుటుంబంతో ఎక్కువ సమయం కేటాయించాలని సూచించారు. గంజాయి సేవించారా లేదా అని తెలుసుకునేందుకు ప్రభుత్వం ప్రతి పోలీస్ స్టేషన్‌కు డ్రగ్ కిట్ ఏర్పాటు చేసిందన్నారు. ఆ కిట్టుతో పరీక్ష నిర్వహిస్తే 22 రకాలు డ్రగ్స్ బయటపడతాయని తెలిపారు. ఈ సదస్సులో ఎక్సైజ్ ఎస్ఐ విజయ్‌కుమార్, మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాగిరెడ్డి, ప్రవీణ్ సింగ్, పెరిక సంపత్ కుమార్, కొండ నాయక్, ప్రసాద్, బాబురావు, ఎన్‌సీసీ బెటాలియన్ కేడెట్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కోట కరుణాకర్

స్వపరిపాలన దినోత్సవం

పెద్దఅడిశర్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీసాయి కృష్ణవేణి పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వడ్లపల్లి చంద్రారెడ్డి ,రాంరెడ్డి, ఉపాధ్యాయులు సైదిబాబు, వెంకట్, కుర్షీద్, మహేష్, ప్రేమ్, గణేష్, నీరజ, జ్యోతి పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులు